క్లుప్తంగా

చిన్నారి వైద్య కోసం ఆర్థిక సాయం



పామర్రు: స్థానిక కొరముక్కువానిపురానికి చెందిన బాలుడు కంచర్ల బాలాదిత్య వైద్య చికిత్సల నిమిత్తం మానవత సేవా సంస్థ అధ్యక్షుడు త్రివిక్రమరావు మంగళవారం రూ.6వేలను అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు పీఎంఎస్ ప్రసాద్, సీతాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి అందజేత



చినముత్తేవి(మొవ్వ): దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని పురస్కరించుకుని మంగళవారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మొవ్వ మండలం చినముత్తేవి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు విద్యాసామగ్రిని అందజేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి యారా సాయిప్రశాంత్ విద్యార్థులకు, నోట్ బుక్స్‌తో పాటు ఇతర ఉపకరణాలను పంపిణీ చేశారు. తొలుత వైఎస్సార్ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామ్మూర్తి, రామలింగ వరప్రసాద్, సుంకర వెంకట నరేష్, తోడేటి బాబురావు, కన్వీనర్ కోలాంటి యోహాన్, చీలి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన



కూచిపూడి(మొవ్వ): మొవ్వ మండలం కూచిపూడిలోని శ్రీ సిద్ధేంద్ర జిల్లా పరిషత్ ఓరియంటల్ హైస్కూల్లో మంగళవారం పరిశుభ్రత తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వ్యాధులు ప్రబలేందుకు కారణమైన దోమల వ్యాప్తి నివారణ చర్యలపై హెల్త్ అసిస్టెంట్ కె. రామాంజనేయులు విద్యార్థులకు వివరించారు. వర్షాకాలంలో కాచి చల్లార్చిన నీరు తాగాలన్నారు. పరిశుభ్రమైన వేడి ఆహార పదార్థాలు తీసుకోవాలని పేర్కొన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమల లార్వా అభివృద్ధి చెందకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం అనుపల్లవి భువనేశ్వరి పాల్గొన్నారు.

మహానందీశ్వరుడికి ప్రత్యేక పూజలు

పెనమలూరు: యనమలకుదురులో వేంచేసి ఉన్న శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో మంగళవారం శ్రీమహానందీశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రదోష కాలంలో మహానందీశ్వరుడికి అభిషేకం చేశారు. అనంతరం విశేష అలంకరణ చేసి అర్చనలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఘనంగా శాకంబరీ ఉత్సవాలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం పెరికీడులోని గంగానమ్మ తల్లి దేవస్థానంలో శాకంబరీ ఉత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. అమ్మవారిని రకరకాల కూరగాయాలతో విశేషంగా అలంకరించారు. ఆలయంలో శాకంబరీ అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారి దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అమ్మవారి పరివార దేవతలు గణపతి, కుమారస్వామి, కాలభైరవస్వామి, పోతురాజు స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి, అర్చనలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు నందూరి సత్య వెంకటేశ్వరశర్మ, నక్కా బాబు, జెట్టి సీతమ్మ, పుట్టి రాంబాబు, వేణు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు వీడ్కోలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక నూజివీడు రోడ్డులోని బాపులపాడు జెడ్పీ హైస్కూల్ నుంచి ఇటీవల బదిలీపై వెళ్లిన ప్రధానోపాధ్యాయుడు తోట వెంకటనాగేశ్వరరావు, ఇతర ఉపాధ్యాయులకు మంగళవారం వీడ్కోలు పలికారు. పాఠశాల అభివృద్ధి కమిటీ, తల్లిదండ్రుల కమిటీ ఆధ్వర్యంలో హెచ్ఎం నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు బి.భారతీ లక్ష్మీ, ఎస్.లక్ష్మీ నాంచరమ్మ, వి.లక్ష్మీబాయి, జె.ప్రమీలారాణి, జె.ఎం.శ్రీనివాస్, పి. వెంకటేశ్వరరావు, శారద దుర్గేశ్వరి, కృష్ణకుమారిలకు పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించారు. పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ సుంకర సుభాష్‌చంద్రబోస్, స్రవంతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరమాచినేని సత్యప్రసాద్, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, జెడ్పీటీసీ సభ్యురాలు గంగాభవాని, పాఠశాల హెచ్ఎం ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పామర్రులో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్



నందివాడలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



వీరంకిలాకులో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పార్టీ శ్రేణులు



చిగురుకోటలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ, నాయకులు

పేదల గుండె చప్పుడు డాక్టర్ వైఎస్సార్

ఘనంగా వైఎస్సార్ జయంతి వేడుకలు

పామర్రు: చరిత్ర మరువని మహోన్నత వ్యక్తి, పేదల గుండె చప్పుడు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అని పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని పురస్కరించుకుని మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంతో పాటు పలుచోట్ల వైఎస్సార్ విగ్రహాలకు మంగళవారం మాజీ ఎమ్మెల్యే పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో కేక్‌ను కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు తాడిశెట్టి శ్రీనివాసరావు, ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యురాలు కె స్వరూప రాణి, వైస్ ఎంపీపీలు ఆరేపల్లి శ్రీనివాసరావు, ఆరుమళ్ల రమాదేవి, ఎంపీటీసీ సభ్యురాలు రత్నకుమారి, కో ఆప్షన్ సభ్యులు ఎండీ హస్మతుల్లా, ఉప సర్పంచ్ బాల వెంకటేశ్వరరెడ్డి, నాయకులు కాకర్ల వెంకటేశ్వరరావు, రాజు, శ్రీనాథ్‌రెడ్డి, అప్పిరెడ్డి, సజ్జల సుబ్రమణ్యం, ఎం.సుబ్రమణ్యం, నాని, హుస్సేన్, ఎస్.సింహా, కూసం బ్రదర్స్ తదితరులు పాల్గొన్నారు.

కొండిపర్రులో..

గ్రామంలోని మందిరంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ విగ్రహానికి నాయకుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ మున్నంగి సత్యనారాయణరెడ్డి నివాళులర్పించారు. ఎంపీటీసీ సభ్యుడు మహేష్, నాయకులు మోరా సంజీవరెడ్డి, మున్నంగి ఫణీందరరెడ్డి, మల్లేశ్వరరెడ్డి, త్రినాథ్, కోటిరెడ్డి, భాస్కరరావు, కాంతారెడ్డి పాల్గొన్నారు.

పమిడిముక్కలలో..

పమిడిముక్కల: మండలంలోని వీరంకిలాకు, పమిడిముక్కల, కపిలేశ్వరపురం గ్రామాల్లో వైఎస్సార్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని వైఎస్సార్ విగ్రహాలకు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యలమంచిలి గణేష్, జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటరమణ కుమారి, మాజీ ఎంపీపీ వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీలు కొడమంచిలి మహేష్, సీతారామయ్య నివాళులర్పించారు. నాయకులు బోసు బాబు, చంద్రపాల్, సాంబశివరావు, బుజ్జి, కోటేశ్వరరావు, రాంబాబు, రాణి, ఎంపీటీసీ సభ్యులు వంశీ, ఆదిశేషు పాల్గొన్నారు.

నందివాడలో..

నందివాడ: నందివాడలో వైఎస్సార్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బైక్ ర్యాలీలో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వైఎస్సార్ విగ్రహానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ పెయ్యల ఆదం, వైఎస్సార్ సీపీ కృష్ణా జిల్లా ప్రధాన కార్యదర్శి కందుల నాగరాజు, రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ ప్రధాన కార్యదర్శి దేశిరెడ్డి రామ్మోహన్ రెడ్డి, తోట నాగరాజు, రంగారెడ్డి, రాజులపాటి చంద్రశేఖర్, శ్రీనివాసరెడ్డి, నాగేశ్వరరావు, నాగూర్ తదితరులు పాల్గొన్నారు.



పామర్రులోని కూడలి వద్ద వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా మంగళవారం గుడ్లవల్లేరు, మామిడికోళ్ల, అంగలూరు, శేరీ కల్వపూడి, డోకిపర్రు, వడ్లమన్నాడులో ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ చిత్రపటాలు, విగ్రహాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అంగలూరు గ్రామ సర్పంచ్ మేడేపల్లి రవికుమార్, ఉప సర్పంచ్ త్రిపురనేని సురేష్, నాయకులు దుగ్గిరాల శేషుబాబు, వీరంకి శివ, వడ్లమన్నాడు గ్రామ సర్పంచ్ కటికల జ్యోతిలత, ప్రవీణ్, ఎంపీటీసీ సభ్యుడు మండా దిలీప్‌కుమార్, కొండలమ్మ గుడి మాజీ చైర్మన్లు శేషంగోపి, పెన్నేరు ప్రభాకర్, నాయకులు రాజేంద్రప్రసాద్, సుజాత, నాంచారయ్య, రవి, నాగు, శివాజీ, వెంకటస్వామి, వీర రాఘవులు, హరిబాబు, సుబ్బయ్య, అహ్మద్ వహీదుల్లా, యాకోబు, రత్నకుమార్, మున్వర్, రామనాంచారయ్య, నరసింహారావు, అడపా గోపాలకృష్ణ, రమేష్, ప్రేమ్‌కుమార్, రంగారావు, రామ్మోహన్, సురేష్, పోస్టల్ రాజు, నాంచారయ్య, భాగ్యలక్ష్మి, ప్రసాద్, బాషా, సుధాకర్, ఏసుపాదం, ప్రసన్న, నాగరాజు, రాఘవేంద్రరావు, శివ, ఫణి, దుర్గారావు, జోజిబాబు, లూథర్, ప్రసాద్, అనిల్, గోపి, అన్వర్ భాష, అజయ్‌బాబు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు వైఎస్సార్

ముదినేపల్లి రూరల్: దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చిరస్మరణీయుడని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. మండలంలోని ముదినేపల్లి, పెయ్యేరు, చిగురుకోట, వడాలి, ములకలపల్లి గ్రామాల్లో మంగళవారం వైఎస్సార్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలతో వైఎస్ పేదల గుండెల్లో చిరస్మరణీయుడిగా నిలిచారన్నారు. నాయకులు కోమటి విష్ణువర్ధన్, శీలం రామకృష్ణ, బత్తిన కిషోర్, జాస్తి చంటి, రాచూరి కుమార్, మోత్రు ఏసు, కట్టా కోటేశ్వరరావు, మేడూరి వెంకటేశ్వరరావు, మరీదు హనుమంతు, దివి శ్రీధర్, సాయిబాబు పాల్గొన్నారు. పెదగొన్నూరులో వైఎస్సార్ విగ్రహం వద్ద వైఎస్ జయంతి వేడుకలు నిర్వహించారు. నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడు దొంతు యజ్ఞనారాయణ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఎంపీటీసీ తుమ్మలచర్ల ఏసుబాబు, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు మురళీ, బత్తుల సత్యదాసు, గొంతు నాగభూషణం, వర్రె వెంకట్రావు, యండూరి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

మండవల్లిలో..

మండవల్లి: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చేబోయిన వీర్రాజు, మండల పార్టీ అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బేతపూడి యేసోబురాజు, బి.రత్తయ్యనాయుడు, సర్పంచ్ థామస్, సత్యనారాయణ పాల్గొన్నారు. కానుకొల్లులో వైఎస్సార్ జయంతిని నిర్వహించారు. సర్పంచ్ నాగదాసి థా మస్, పుట్టి సత్యనారాయణ, కొంతి మునలయ్య, జోజి రాణి, నాగేశ్వరరావు, రాజశేఖర్, నరేష్, శీను, శివ, తదితరులు పాల్గొన్నారు. ఉనికిలిలో వైఎస్సార్ జయంతిని ఘనంగా నిర్వహించారు.

భైరవపట్నంలో..

భైరవపట్నంలో వైఎస్సార్ జయంతిని నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కనుమూరి వాసు, అల్లాడి పూర్ణ, నాగదాసి చంటి, కన్నెపాముల రమేష్ పాల్గొన్నారు.

వైఎస్సార్ పాలన స్వర్ణయుగం

కైకలూరు: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పాలన ఓ స్వర్ణయుగమని వైఎస్సార్ సీపీ ముదిరాజుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కోమటి విష్ణువర్ధనరావు, ఏలూరు జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు చేబోయిన వీరరాజు అన్నారు. కైకలూరు సంతమార్కెట్ వైఎస్సార్ విగ్రహం వద్ద ఆయన జయంతిని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్ కుమారుడు దూలం వినయ్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. మండవల్లి ఎంపీపీ, పార్టీ పంచాయతీ వింగ్ రాష్ట్ర సెక్రటరీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గా ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముదినేపల్లి ఎంపీపీ, పార్టీ వాణిజ్య విభాగ రాష్ట్ర సెక్రటరీ రామిశెట్టి సత్యనారాయణ, డీఎన్నార్ తనయుడు దూలం వినయ్ మాట్లాడుతూ రాజశేఖరరెడ్డి బ్రాండ్‌ను ఎవరూ చెరపలేరన్నారు. జిల్లా అధికార ప్రతినిధి గోట్రూ అర్జునరావు, ఎస్సీ సెల్ నాయకులు గుమ్మడి వెంకటేశ్వరరావు, నాయకులు బీవీ.రావు, కలిదిండి ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, బీసీ సెల్ రాష్ట్ర సెక్రటరీ బలే నాగరాజు, మండల పార్టీ అధ్యక్షుడు సింగంశెట్టి రాము, బేతపూడి ఏసోబురాజు, తిరుమాని రమేష్, ఎంపీటీసీలు కొండయ్య, బాలమ్మ, నాగరాజు, నాయకులు రామారావు, రవికుమార్, మోహనరావు, నవీన్, గాలిబ్ బాబు, వెంకటేశ్వరరావు, రఫీ, రత్తయ్యనాయుడు, చినరాజు, కూనవరపు సతీష్, మహేష్, రేగిశెట్టి రాము, అంజి తదితరులు పాల్గొన్నారు.

కలిదిండి మండలంలో..



కైకలూరు సంత మార్కెట్ వద్ద కేక్ కట్ చేసి పంచిపెడుతున్న నాయకులు



కలిదిండి మండల తాడినాడలో వైఎస్సార్ విగ్రహం వద్ద నాయకుల నివాళి

చినతాడినాడ గ్రామంలో వైఎస్సార్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రామ సర్పంచ్ గండికోట ఏసుబాబు ఆధ్వర్యంలో వైస్ ఎంపీపీ, పార్టీ రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి కుసంపూడి కనకదుర్గా రాణి, గ్రామ పార్టీ అధ్యక్షుడు గొల్ల మరియరాజు, వైస్ సర్పంచ్ స్టీవెన్ సన్, నాయకులు సువర్ణరాజు, శేఖర్, ధర్మరాజు, రత్నారాజు, పండు పాల్గొన్నారు.

తోట్లవల్లూరులో..



తోట్లవల్లూరులో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు, కార్యకర్తలు

తోట్లవల్లూరు: మహానేత, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి కార్యక్రమాలు మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఘనంగా జరిగాయి. వాడ వాడలా మహానేత విగ్రహాలు, చిత్రపటాలకు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. తోట్లవల్లూరులో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. మార్కెట్ సెంటర్, దళితవాడ సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహాలకు ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీ జొన్నల రామ్మోహన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు, కార్యకర్తలకు స్వీట్లు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మోర్ల రామచంద్రరావు, వైస్ ఎంపీపీ కళ్లం శివారెడ్డి, నాయకులు నడకుదురు రాజేంద్ర, పీఎస్ కోటేశ్వరరావు, చింతలపూడి గవాస్కర్‌రాజు, తిరుమలశెట్టి వాసు, మైనేని తారాచంద్, షేక్ లతీఫ్, ఈడ్పుగంటి రూబెన్, కిలారం రామకృష్ణ పాల్గొన్నారు.

జన హృదయ నేతకు ఘన నివాళులు

గుడివాడ టౌన్: తెలుగు ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయిన మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. మంగళవారం పట్టణంలో దివంగత నేత వైఎస్సార్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక రాజేంద్ర నగర్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వైఎస్సార్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వేడుకల్లో భాగంగా కేక్ కట్ చేశారు.

భారీ ర్యాలీ

వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గుడివాడ పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. రాజేంద్రనగర్, ఏలూరు రోడ్, నెహ్రూ చౌక్ సెంటర్ మీదుగా ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వరకు ర్యాలీ కొనసాగింది.

రక్తదానం

వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు మెరుగుమాల కాళీ ఆధ్వర్యంలో యువకులు రక్తదానం చేశారు. తొలుత ఏరియా ఆస్పత్రి ప్రాంగణంలోని వైఎస్సార్ విగ్రహానికి నాయకులు పాలాభిషేకం చేశారు. అనంతరం ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలోనాయకులు దుక్కిపాటి శశిభూషన్, పాలేటి చంటి, పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ కాసీం, నాయకులు గంటా శ్రీను, షేక్ బాజీ, షేక్ సయ్యద్, దుద్దు చిన్నా, టి. యెషయ్య, కె. మురళి, ఏలేటి విలియం జోషి, సీహెచ్ బాస్కరరావు, ఎ. పురుషోత్తం, పి. కృష్ణారావు, కె. కిరణ్, చుండూరి శేఖర్, జె. సత్యవేణి, ఎం. వెంకట లక్ష్మి, హారిక, సురేఖ, ఉమ, రమీజా, రాణి, విజయ రాణి, కె. నరేంద్ర, పి. సత్యనారాయణ, బాషా, నీలాకాంత్ పాల్గొన్నారు.



గుడివాడలో వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



మండవల్లిలో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



కానుకొల్లులో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



వడ్లమన్నాడులోని వైఎస్సార్ విగ్రహ వద్ద కేక్‌ను కట్ చేస్తున్న నాయకులు



భైరవపట్నంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

వైఎస్సార్ సీపీ బ్యానర్ల తొలగింపు

టీడీపీ నేతల ఆదేశాలతో పోలీసుల సమక్షంలో తొలగింపు

పామర్రు: రెడ్ బుక్ రాజ్యాంగంలో భాగంగా వైఎస్సార్ సీపీ బ్యానర్లను పోలీసుల సమక్షంలో పంచాయతీ సిబ్బంది తొలగించారు. స్థానిక ఆరేపల్లి కల్యాణ మండపంలో మంగళవారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ప్రధాన రహదార్ల వెంబడి బ్యానర్లను సోమవారం ఏర్పాటు చేశారు. ఈ విషయాన్ని తెలుసుకున్న స్థానిక టీడీపీ నేతలు ఈ కార్యక్రమం నిర్వహిస్తే తమకు నష్టం జరుగుతుందని స్థానిక పోలీసులతో రహదారి వెంబడి ఏర్పాటు చేసిన బ్యానర్లను తొలగించాలని ఆదేశించడంతో పంచాయతీ సిబ్బందితో బ్యానర్లను తొలగింపజేశారు. ఈ విషయమై వైఎస్సార్ సీపీ నేతలు సీఐ సుభాకర్‌ను వివరణ కోరగా బ్యానర్లపై బాబు అని ఉండటం వలన టీడీపీకి ఇబ్బందికరంగా ఉన్నందున తొలగించాలని అధికార పార్టీ ఆదేశాల మేరకే వాటిని తొలగిస్తున్నట్లు తెలిపారు. బ్యానర్ల తొలగింపులో ఎస్ఐ రాజేంద్ర ప్రసాద్, కార్యదర్శి సలీం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



రహదారి వెంబడి ఉన్న బ్యానర్లను తొలగిస్తున్న సిబ్బంది

డ్రోన్ పరిజ్ఞానాన్ని వ్యవసాయ రంగానికి జోడించండి

ఇన్‌చార్జి ఏడీఏ వెంకటమణి

కలిదిండి (కైకలూరు): వ్యవసాయ రంగానికి అధునాతన డ్రోన్ సాంకేతిక పరిజ్ఞానాన్ని అన్వయించి ఫలితాలు సాధించాలని ఇన్‌చార్జి వ్యవసాయ సహాయ సంచాలకులు జి.వెంకటమణి అన్నారు. మట్టగుంట, సానారుద్రవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మండల వ్యవసాయాధికారి కె.విద్యాసాగర్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది. సానారుద్రవరంలో డ్రోన్ పనితీరును రైతులకు ప్రయోగాత్మకంగా వివరించారు. ఏఓ విద్యాసాగర్ మాట్లాడుతూ డ్రోగో డ్రోన్ అసలు ధర రూ.9,80,000 ఉండగా రైతు రూ.4,90,000 చెల్లిస్తే, బ్యాంకు రుణంగా రూ.4,90,000 అందిస్తుందన్నారు. ప్రభుత్వం 80 శాతం సబ్సిడీతో రూ.7,80,000 తిరిగి వెనక్కి వస్తోందన్నారు. చివరకు రైతుకు రూ.2 లక్షలకే డ్రోన్ లభించినట్లు అవుతుందన్నారు. డ్రోన్‌తో కూలీల ఖర్చులు తగ్గడంతో పాటు రసాయనాలు వల్ల ఊపిరితిత్తుల సంబంధ వ్యాధుల నుంచి రైతులు రక్షణ పొందవచ్చన్నారు. డ్రోన్ నిర్వహణకు శిక్షణ సైతం అందిస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు, డ్రోగో డ్రోన్ కంపెనీ యాజమాన్యం, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.



సానారుద్రవరంలో డ్రోన్‌ను ప్రయోగిస్తున్న శిక్షణ తీసుకున్న రైతు

హాస్టల్ నుంచి పరారైన విద్యార్థి

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రైవేట్ కాలేజీ హాస్టల్‌లో ఉండలేక పరారైన ఇంటర్మీడియట్ విద్యార్థిని వీరవల్లి పోలీసులు గంటల వ్యవధిలో పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాల్లోకి వెళ్లితే.. ఉంగుటూరు మండలం ఆత్కూరుకు చెందిన పామర్తి వెంకటేశ్వరరావు తన కుమారుడు జస్వంత్‌ను నూజివీడులోని ఓ ప్రైవేట్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీలో నెల రోజుల క్రితమే జాయిన్ చేశాడు. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు, ఇంటిపై బెంగ పెట్టుకున్న జస్వంత్ సోమవారం సాయంత్రం కాలేజీ బస్సులో ఇంటికి బయలుదేరి మార్గమధ్యంలో బండారుగూడెం వద్ద దిగిపోయాడు. సమయానికి ఇంటికి చేరకపోవడంతో అనుమానం వచ్చిన తండ్రి వెంకటేశ్వరరావు వీరవల్లి పోలీసులకు మంగళవారం ఉదయం ఫిర్యాదు చేశారు. అప్రమత్తమైన ఎస్ఐ ఎం.శ్రీనివాస్ హనుమాన్‌జంక్షన్ ఆర్టీసీ బస్టాండ్‌లో జస్వంత్‌ను పట్టుకున్నారు. విద్యార్థికి కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.

క్లుప్తంగా

రేపు గురుపూర్ణిమ

కంకిపాడు: గురుపూర్ణిమ పర్వదినాన్ని ఈనెల 10వ తేదీన ప్రొద్దుటూరు శివారు గాయత్రీ విహార్‌లో నిర్వహించనున్నట్లు గాయత్రీ విహార్ భక్త బృందం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. స్థానికంగా ఉన్న ధ్యాన యోగ సాయి మందిరంలో ఉదయం నుంచి బాబావారికి భక్తులచే పంచామృత అభిషేకం, సహస్ర నామార్చన, హారతి, ప్రసాద వితరణ ఉంటాయన్నారు. భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

కార్మెల్‌మాత పుణ్యక్షేత్ర మహోత్సవాలు ప్రారంభం



పెనమలూరు: కానూరు మౌంట్ కార్మెల్‌మాత పుణ్యక్షేత్రం మహోత్సవం నవదినాల విచారణ గురువు ఫాదర్ సలివేంద్ర శౌరి, ఫాదర్ బొల్లికొండ జయరాజు ఆధ్వర్యంలో ప్రారంభించారు. పుణ్యక్షేత్రంలో సోమవారం రాత్రి పతాకావిష్కరణ చేశారు. ఫాదర్లు వివరాలు తెలుపుతూ ఈనెల 15వ తేదీ వరకు ప్రతి రోజూ సాయంత్రం ఆరు నుంచి రాత్రి 10 గంటల వరకు నవదిన ప్రార్థనలు, దివ్యబలి పూజలు నిర్వహిస్తామన్నారు. 16న కార్మెల్ మాత మహోత్సవం సందర్భంగా సాయంత్రం ఆరు నుంచి మహోత్సవ సమిష్టి దివ్య బలిపూజలు వికార్ ప్రవెనిషయల్ ఫాదర్ కెవిన్ ఆంథోని సమర్పిస్తారు. తొమ్మిది రోజులు భక్తులకు ప్రేమ విందును అందిస్తామని తెలిపారు.

ఎంబీఏతో ఉపాధి అవకాశాలు

పెనమలూరు: మేనేజ్‌మెంట్ విద్యతో ఉపాధి అవకాశాలు ఉంటాయని పారిశ్రామికవేత్త, ఎఫ్టానిక్స్ సిస్టమ్స్ సీఈవో దాసరి రామకృష్ణ అన్నారు. కానూరు సిద్ధార్థ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్, సిద్ధార్థ డీమ్డ్ టుబీ యూనివర్సిటీ ఎంబీఏ రెండవ బ్యాచ్ మంగళవారం ప్రారంభమైంది. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎంబీఏ విద్యార్థులు ఉపాధిలో రాణించాలంటే నైపుణ్యం సాధించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ప్రో వైస్‌చాన్సలర్ డాక్టర్ ఏవీ.రత్నప్రసాద్, ప్రొఫెసర్ అనురాధ, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ ఎ.శ్రీరామ్, డీన్ ఎ.విశలేశ్వర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ

పెనమలూరు: కానూరులో అన్నేట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం బాలికలకు సేవా కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని వినాయక్ నగర్‌లో వాసవి మహిళ మండలి ఆధ్వర్యాన ఉన్న బాలికల హోమ్‌లోని 100 మంది బాలికలకు అన్నే ట్రస్టు ఉచితంగా నోట్ పుస్తకాలు పంపిణీ చేసింది. అదేవిధంగా సానిటరీ ప్యాడ్స్ కూడా అందజేశారు. కార్యక్రమంలో దాతలు అన్నే తారాకృష్ణ, అన్నే మీరాకృష్ణ, వేమూరి దీప్తివర్ధిని, అన్నే శ్రావణ్‌కుమార్, చాగంటిపాటి అరవింద్, రాజా, వంగర లప్పు తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో మంగళవారం పలువురు కళాకారులు నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై విజయవాడకు చెందిన శ్రీరాజేశ్వరి నృత్యాలయానికి చెందిన రాయన రాజేశ్వరి పర్యవేక్షణలో పలువురు చిన్నారులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. 15 మంది చిన్నారులు పలు కీర్తనలకు చక్కటి అభినయంతో నృత్యం చేయగా, భక్తులు వారిని అభినందించారు. అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు ప్రసాదాలను అందజేశారు.

లేబర్ కోడ్స్ పుస్తకావిష్కరణ



పటమట(విజయవాడతూర్పు): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వర్గాన్ని నీరు కారుస్తున్నాయని, ముఖ్యంగా భవన నిర్మాణ కార్మికుల సమస్యలు తీవ్రతరం అవుతున్న పట్టించుకోని ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కార్మిక సంఘాలు పనిచేయాలని సీఐటీయూ భవన నిర్మాణ కార్మికుల యూనియన్ నగర అధ్యక్షుడు వీజీ రాజు అన్నారు. బెంజిసర్కిల్ వద్ద బుధవారం దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా భవన నిర్మాణ పెయింటర్ కార్మికులతో లేబర్ కోడ్స్ పుస్తకాన్ని మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాలకు వ్యతిరేకంగా జూలై 9న దేశ వ్యాప్త సమ్మెలో అన్ని వర్గాలు ప్రత్యక్షంగా పాల్గొని భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. అసంఘటిత నిర్మాణ కార్మికులంతా సంక్షేమ బోర్డును పునరుద్ధరణ చేసుకోవడానికి, కార్మికులను ఆదుకునేందుకు ఎన్నికల్లో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో పెయింటర్ నాయకుడు పి.రాజు రామయ్య, కార్మికులు పాల్గొన్నారు.

రానున్న కాలంలో ఒకటికి పది రెట్లు చెల్లిస్తాం

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పేర్ని వెంకట్రామయ్య



సమావేశానికి హాజరైన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు



మాట్లాడుతున్న కృష్ణా జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పేర్ని వెంకట్రామయ్య(నాని), పక్కన మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

పామర్రు: ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వైఎస్సార్ సీపీ శ్రేణులపై కక్షసాధింపు చర్యలు చేపడుతూ ఇబ్బందులకు గురి చేస్తోందని, భవిష్యత్‌లో వారికి ఒకటికి పది రెట్లు చెల్లిస్తామని వైఎస్సార్ సీపీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు పేర్ని వెంకట్రామయ్య(నాని) పేర్కొన్నారు. స్థానిక ఆరేపల్లి కల్యాణ మండపంలో పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమంపై నియోజకవర్గ స్థాయి కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశం మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా నాని పాల్గొని మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై లేని పోని అంశాలపై కేసులు పెడుతున్నారన్నారు. తస్మాత్ జాగ్రత్త.. గతంలో 2017లో గోదావరి పుష్కరాల సమయంలో తొక్కిసలాటలో చనిపోయిన వారి కుటుంబ సభ్యులు భవిష్యత్‌లో జగన్ సీఎం అయిన తర్వాత వచ్చి కంప్లైంట్ చేస్తే, గుంటూరులో చీరల పంపిణీలో చనిపోయిన మహిళల కుటుంబ సభ్యులు కంప్లైంట్ చేస్తే చంద్రబాబు నిందితుడు కాదా అని ప్రశ్నించారు. అదేవిధంగా కందుకూరులో ఇరుకు సందులలో మీటింగ్ పెట్టి ఎంతో మంది ప్రాణాలు పోవడానికి కారణమయ్యారు.. వారి కుటుంబ సభ్యులు కంప్లైంట్ చేస్తే చంద్రబాబు నిందితుడు కాదా అని ప్రశ్నించారు. 2029లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావడం తథ్యమన్నారు. కూటమి సభ్యులు ఇల్లు అలుకగానే పండుగ కాదనే విషయాన్ని గ్రహించి, సత్‌ప్రవర్తనతో మెలగాలని కోరారు. సమాజానికి మంచిని ఇవ్వాల్సిన ఎల్లో మీడియా జగన్‌పై విష ప్రచారం చేస్తున్నారనే విషయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. భవిష్యత్‌లో రెండు ఏళ్లు పూర్తి అయిన తర్వాత వైఎస్సార్ సీపీ ప్లీనరీ పూర్తి అయిన తర్వాత జగన్ పాదయాత్ర ప్రారంభించి రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి రావటం జరుగుతుందన్నారు. రానున్న కాలంలో పార్టీ జెండాను మోసే ప్రతి కార్యకర్తకు పరిపతి, మర్యాద పెరిగేవిధంగా సముచిత స్థానం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజల మనస్సులను గెలిచి అధికారం చేజిక్కించుకోవడమే మన లక్ష్యం కావాలని పిలుపునిచ్చారు. అధికార మదంతో కూటమి ప్రభుత్వం విర్రవీగుతూ తప్పుడు కేసులను బనాయిస్తోందన్నారు. ఇదే సంస్కృతిని సాంప్రదాయంగా అలవాటు చేస్తే భవిష్యత్‌లో ఇవే మీకు అప్పగించడం జరుగుతుందన్నారు. చంద్రబాబు గత ఎన్నికల్లో ప్రజలకు అబద్ధపు హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేశారన్న విషయాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు.

మోసం చేసేందుకు పుట్టిన వ్యక్తి బాబు

పెనమలూరు ఇన్‌చార్జి చక్రవర్తి మాట్లాడుతూ ప్రజలను మోసం చేయటానికి పుట్టిన వ్యక్తి చంద్రబాబు అన్నారు. హామీలపై టీడీపీ శ్రేణులను నిలదీయాలన్నారు. అవనిగడ్డ ఇన్‌చార్జి సింహాద్రి రమేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి జగన్ పేరు చెబితే దడ పుడుతోందన్నారు. అందుకే జగన్‌పై అవాకులు చెవాకులు మాట్లాడుతున్నారన్నారు. మచిలీపట్నం పార్లమెంట్ అబ్జర్వర్ జె.గురునాథం మాట్లాడుతూ అబద్ధపు ప్రచారాలతో ప్రజలను మోసం చేసి గెలిచిన చంద్రబాబు తీరుని ప్రజలకు తెలియజేయాలన్నారు.



మాట్లాడుతున్న పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

జగన్‌ను ఆదరిస్తున్న జనం

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ ద్వారా వేలాది ప్రాణాలను కాపాడిన మహోన్నత వ్యక్తి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అని పేర్కొన్నారు. వైఎస్సార్ కన్నా 10 అడుగులు ముందుకు వేసి ప్రజాసేవకే అంకితమైన జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలందరూ ఆదరిస్తున్నారన్నారు. పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన వాగ్దానాలను ఏ విధంగా నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశాడో గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి తెలియజేయాలన్నారు. కూటమి ప్రభుత్వం మట్టి, ఇసుక మద్యం మాఫియాలతో ప్రభుత్వ ధనం వేల కోట్లు దండుకుంటున్నారన్నారు. ఈ విషయాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. మచిలీపట్నం ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' అనే అంశాన్ని యాప్ ద్వారా ప్రవేశపెట్టి ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి కైలే జ్ఞానమణి, ఎంపీపీలు దాసరి అశోక్‌కుమార్, గోగం సురేష్, జెడ్పీటీసీ సభ్యులు కె.స్వరూపరాణి, జొన్నల రామ్మోహన్‌రెడ్డి, రాజుల పాటి పార్వతి, ఏనుగు వెంకటరమణ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు కాకర్ల వెంకటేశ్వరరావు, కళ్లం వెంకటేశ్వరరెడ్డి, జగన్, రాజేంద్ర, మోర్ల రామచంద్రరావు, శొంఠి వెంకటేశ్వరరావు, జ్యోతి తదితర ఐదు మండలాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వరి నాట్లలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



మద్దూరులో జామతోటను సందర్శిస్తున్న శాస్త్రవేత్త విజయభాస్కర్‌రెడ్డి, వ్యవసాయాధికారులు

పెనమలూరు: వరి నాట్లలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి కనకమదల శైలజ సూచించారు. వణుకూరు గ్రామంలో మంగళవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. నాట్లు వేసే సమయంలో రైతులు దమ్ములో యూరియా, పొటాషియమ్ కలిపి వేయాలన్నారు. కాగా ఈనెల 18వ తేదీన అన్నదాత సుఖీభవ సొమ్ము అర్హులైన రైతుల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. అలాగే 10వ తేదీ నుంచి పంట నమోదు కార్యక్రమం చేపడతామని రైతులకు వివరించారు.

పచ్చిరొట్టతో భూసారం పెంపుదల

కంకిపాడు: పచ్చిరొట్టతో భూసారం పెంపొందుతుందని ఉయ్యూరు చెరకు పరిశోధనాస్థానం శాస్త్రవేత్త డాక్టర్ యు.విజయభాస్కర్‌రెడ్డి సూచించారు. మండలంలోని గొడవర్రు, మద్దూరు గ్రామాల్లో వ్యవసాయాధికారి వి.ఉషారాణి బాబూరావు పర్యవేక్షణలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చిరొట్ట పైర్లతో కలిగే ప్రయోజనాలను వివరించారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించుకోవాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి ఉషారాణి మాట్లాడుతూ రైతులు అన్నదాత సుఖీభవ జాబితాలో పేర్లు సరిచూసుకోవాలన్నారు. పేర్లు కనిపించకపోతే అర్జీ దాఖలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి ఈ.హరిచంద్, కాసరనేనివారిపాలెం సర్పంచ్ పి.వరప్రసాద్, పలువురు రైతులు పాల్గొన్నారు.

మానికొండ(గన్నవరం): ఉంగుటూరు మండలం మానికొండ గ్రామంలో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది నిర్వహించారు. డీటీసీ కె. జ్యోతిరమణి, మండల వ్యవసాయ అధికారి జీ. రమేష్, డీఆర్‌సీ ఏఓ బీ. పద్మజ, ప్రకృతి వ్యవసాయ విభాగానికి చెందిన సీతా రామప్రసాద్, పలువురు వీఏఏలు పాల్గొన్నారు.

ఎంఈఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడిగా ఏసుబాబు

గన్నవరం: మాదిగ ఉద్యోగుల సమాఖ్య(ఎంఈఎఫ్) గన్నవరం నియోజకవర్గ అధ్యక్షుడిగా దేవరపల్లి ఏసుబాబు ఎన్నికయ్యారు. స్థానిక ఎస్సీ కాలనీలోని అంబేడ్కర్ పార్కులో మంగళవారం జరిగిన సమావేశంలో కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన ఉపాధ్యక్షులుగా కె. సతీష్, కాట్రు వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శులుగా పులపాక ఏసురత్నం, రాబర్ట్ జాన్సన్, కార్యవర్గ సభ్యులుగా కోటేశ్వరరావు, జ్ఞానానందం, న్యాయ సలహా సభ్యులుగా తగరం కిరణ్, ఎన్. రమేష్ ఎన్నికయ్యారు. ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు దేవరపల్లి విక్టర్‌బాబు, జిల్లా నాయకులు యువరాజు, బొకినాల కృష్ణ, రాచపూడి బాలస్వామి, అనిల్‌కుమార్, వెంకయ్య పాల్గొన్నారు.

రోడ్లపై వర్షం నీరు నిల్వ ఉండరాదు



పంజా సెంటర్‌లో సిబ్బందికి సూచనలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరంలో కొద్దిపాటి వర్షానికే రోడ్లపైన వర్షపు నీటి నిల్వలు ఉండే ప్రదేశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన మంగళవారం నైజాం గేట్, సీఎస్ఐ చర్చి, వించిపేట, పంజా సెంటర్, గొల్లపాలెం గట్టు ప్రాంతాల్లో పర్యటించారు. నైజాం గేట్ మేజర్ అవుట్‌ఫాల్ డ్రెయిన్ వద్ద జరుగుతున్న డిసిల్టింగ్ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు అందించారు. అనంతరం ఆయన వించిపేట కొండ ప్రాంతంలో పర్యటించి అక్కడ నివసిస్తున్న ప్రజలతో మాట్లాడారు. స్థానికంగా జరుగుతున్న తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణపై ఆరా తీశారు. పంజా సెంటర్ వద్ద తృప్తి క్యాంటీన్‌ను పరిశీలించారు. క్యాంటీన్‌ను కేటాయించిన పొదుపు సంఘాల సభ్యులతో మాట్లాడి క్యాంటీన్ ప్రారంభోత్సవానికి కావాల్సిన రుణ సదుపాయంపై ఆరా తీశారు. క్యాంటీన్‌ను త్వరలోనే ప్రారంభించాలని, ప్రారంభోత్సవంలో ఎలాంటి లోపాలు లేకుండా సరిచేసుకోవాలని అధికారులను ఆదేశించారు. చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జున్‌రావు, ప్రాజెక్ట్ ఆఫీసర్(యూసీడీ) పి.వెంకటనారాయణ, డెప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జె.శ్రీనివాస్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

నేత్రాలపై నిర్లక్ష్యం తగదు



వైద్య శిబిరంలో పాల్గొన్న ఖాతాదారులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నేత్రాలపై నిర్లక్ష్యం తగదని రెప్కో బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ కేక పవన్‌చంద్ర అన్నారు. ఆ బ్యాంక్ వన్‌టౌన్ శాఖ ప్రాంగణంలో మంగళవారం ఉచిత నేత్ర వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అయాన్ కంటి ఆస్పత్రి సిబ్బంది, వైద్యులు ఖాతాదారులు ఉచితంగా పరీక్షలను నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన పవన్ చంద్ర మాట్లాడుతూ రెప్కో బ్యాంక్ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. అతి తక్కువ వడ్డీతో ఇంటి తనఖాపై రుణాలు, సీనియర్ సిటిజన్స్‌కు డిపాజిట్స్‌పై అత్యధిక వడ్డీ ఇస్తున్నామన్నారు.

ఓపెన్ చెస్ టోర్నీలో విద్యార్థి ప్రతిభ



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఆల్ ఇండియా ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో శ్రీగౌతమ్‌కు చెందిన విద్యార్థి యశ్వంత్ అద్భుత ప్రతిభను కనబర్చినట్లు స్కూల్ అధినేత నల్లాని సూర్యారావు పేర్కొన్నారు. చిట్టినగర్‌లోని స్కూల్ ఆవరణలో యశ్వంత్‌ను చెస్ కోచ్ రామకృష్ణ, ఉపాధ్యాయులు అభినందించారు. గుంటూరులో సుశీలదేవి మెమోరియల్ ఆల్ ఇండియా వారు నిర్వహించిన పోటీల్లో యశ్వంత్ ద్వితీయ స్థానం సాధించాడని చెప్పారు. కేవలం చదువులో నే కాకుండా ఇండోర్ అవుట్‌డోర్ క్రీడల్లో రాణించేలా శిక్షణ ఇస్తున్నట్లు ఆయన పేర్కొన్నా రు. ప్రతిభ చూపిన యశ్వంత్‌కు స్కూల్ తరఫు న జ్ఞాపికను, ప్రశంసా ప్రతాన్ని అందజేశారు.

మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణకు చర్యలు



మాట్లాడుతున్న సీఎంవోహెచ్ అర్జునరావు

పటమట(విజయవాడతూర్పు): నగరంలో ప్రతి రోజు క్రమం తప్పకుండా ఇంటింటి చెత్త సేకరణ చేయాలని వీఎంసీ సీఎంవోహెచ్ డాక్టర్ అర్జునరావు ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. ఆయన వీఎంసీ నూతన బిల్డింగ్‌లో ఉన్న సమావేశ హాలులో పారిశుద్ధ్య నిర్వహణ విధానంపై అధికారులు, సిబ్బందితో మంగళవారం సమీక్షించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇంటింటి చెత్త సేకరణ సమయంలో తడి, పొడి విభజన జరగాలని, ఈ విధానంపై ప్రజారోగ్య శాఖ కార్మికుల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించడంలో శానిటరీ కార్యదర్శులు, ఇన్‌స్పెక్టర్లు, సూపర్‌వైజర్లు పర్యవేక్షణ చేయాలన్నారు. నగరంలోని గార్బేజి వనరబుల్ పాయింట్లను ప్రతి రోజు శుభ్రపరచాలని, ట్రేడ్ లైసెన్సులు పాతవి కట్టించడం, కొత్తవి చట్ట ప్రకారం లైసెన్సులు మంజూరు చేయడం, పురమిత్ర పీజీఆర్ఎస్ ఫిర్యాదులు సరైన సమయంలో పరిష్కరించాలని చెప్పారు. నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించడం, 120 మైక్రాల కన్నా తక్కువ పరిమాణం క్యారీ బ్యాగుల వాడకం నిషేధం, అపరాధ రుసుం వసూలు, కవర్లను సీజ్ చేయడం, రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలైనా ప్రతి నెలా మూడో శనివారం నిర్వహించు స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో మూడు సర్కిళ్లలోని అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ బాబు శ్రీనివాస్, డాక్టర్ గోపాల్ నాయక్, శానిటరీ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కార్మిక సమస్యలతో పాటుగా ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బుధవారం జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీపీఎం పశ్చిమ కార్యదర్శి బోయి సత్యబాబు అన్నారు. సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ మున్సిపల్ వర్కర్స్ యూనియన్(సీఐటీయు) ఆధ్వర్యంలో 53వ డివిజజన్‌లో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం వద్ద గేట్ మీటింగ్‌ను మంగళవారం నిర్వహించారు. రథం సెంటర్ నుంచి జరిగే కార్మిక మహాప్రదర్శనను కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఆదిలక్ష్మి నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శాకంబరీదేవి అలంకారంలో అమ్మవార్లు



శాకంబరీదేవిగా మహాలక్ష్మీ అమ్మవారు



శాకంబరీదేవిగా భ్రమరాంబ అమ్మవారు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్‌లో వేంచేసిన శ్రీనగరాల మహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం నుంచి శాకంబరీదేవి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉత్సవాలలో భాగంగా మహాలక్ష్మీ అమ్మవారికి వివిధ రకాల పండ్లు, కాయగూరలు, ఆకుకూరలతో అలంకరించారు. ఆలయ కమిటీ కార్యదర్శి మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు, సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం భక్తులకు కదంబ ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

శాకంబరీదేవిగా భ్రమరాంబ దర్శనం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో కొలువై ఉన్న భ్రమరాంబ అమ్మవారు మంగళవారం శాకంబరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. గత దశాబ్ద కాలంగా ఏటా ఆషాఢ మాసంలో శాకంబరీదేవి ఉత్సవాలను నిర్వహించటం ఆనవాయితీగా వస్తోంది. ఆలయ ప్రాంగణాన్ని పండ్లు, కూరగాయలు, ఆకు కూరలతో అలంకరించారు. అమ్మవారి ఉత్సవాన్ని పురస్కరించుకొని పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నటరాజన్ షణ్ముగం పర్యవేక్షించారు.

అమ్మవారికి సారె సమర్పణ



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ఊర్మిళానగర్‌లోని శ్రీమాతా గోవిందమాంబ సమేత శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానం పక్షాన జగన్మాత కనకదుర్గమ్మకు ఆషాఢ సారె సమర్పించారు. మంగళవారం దేవస్థానం నుంచి మహిళలు అమ్మవారికి పసుపు, కుంకుమ, పొంగలి, పండ్లు, వివిధ రకాల స్వీట్స్, అరటిగెలలు తదితర పూజా సామాగ్రితో మేళతాళాల నడుమ ఊరేగింపుగా బయలుదేరారు. ఇంద్రకీలాద్రిపై అమ్మవారికి సారె సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏడాది అమ్మవారికి సారె సమర్పించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు.

ధూమ్ ధామ్‌గా బోనాల పండుగ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 60వ డివిజన్ వాంబేకాలనీలోని కనకదుర్గ అమ్మవారి దేవస్థానంలో బోనాల పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు కుటుంబ సమేతంగా హాజరై అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కృష్ణానది వరకూ ఘటాన్ని ఊరేగించి నిమజ్జనం చేశారు. స్థానిక నాయకుడు కంచి ధనశేఖర్, అమ్మవారి భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు.

దసరాకు నూతన ప్రసాదాల పోటు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దసరా ఉత్సవాల నాటికి అమ్మవారి సన్నిధిలో నూతనంగా నిర్మిస్తున్న ప్రసాదాల పోటు, అన్నదాన భవనాలు అందుబాటులోకి రావాలని దుర్గగుడి ఈవో శీనానాయక్ పేర్కొన్నారు. శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం మాస్టర్ ప్లాన్ ప్రకారం జరుగుతున్న నూతన అన్నదాన భవనం, ప్రసాదాల పోటు భవనాలను ఈవో మంగళవారం పరిశీలించారు. రథం సెంటర్ వద్ద ఇటీవల దేవస్థాన స్థలంలో తొలగించిన ఆక్రమణల ప్రాంతాన్ని ఈవో మంగళవారం పరిశీలించారు. ఆక్రమణలు తొలగించిన ప్రాంతంలో దేవస్థాన సెంట్రల్ రిసెప్షన్ సెంటర్ ఏర్పాటు చేసేందుకు పనులు వేగవంతం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అమ్మవారికి సమర్పించే విరాళాలు, సమాచారం, పూజలు, ఇతర అంశాలన్ని సెంట్రల్ రిసెప్షన్ సెంట్రల్‌లో లభిస్తాయని ఈవో పేర్కొన్నారు. ఈఈ కోటేశ్వరరావు, డీఈ రవీంద్ర, ఏఈ మస్తాన్, ప్రసాదాల తయారీ కాంట్రాక్టర్ చందు తదితరులు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మైనర్ విద్యార్థులకు వాహనాలు ఇవ్వొద్దని ట్రాఫిక్ ఏసీపీ ఏవీఎల్ ప్రసన్నకుమార్ తల్లిదండ్రులకు సూచించారు. ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన ట్రాఫిక్ విభాగం ఆధ్వర్యంలో శారదా కళాశాల ప్రాంగణంలో విద్యార్థుల కోసం 'మైనర్ డ్రైవింగ్ నివారణ–సురక్షిత రోడ్డు దాటే విధానం'పై విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు మైనర్ డ్రైవింగ్ వల్ల ఏర్పడే ప్రమాదాలు, చట్టపరమైన బాధ్యతలు, తల్లిదండ్రుల పాత్రపై స్పష్టమైన అవగాహన కల్పించారు.

కొత్తపేట కాలేజీల పరిసరాల్లో తనిఖీలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్ కార్యక్రమంలో భాగంగా కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని కేబీఎన్ కాలేజీ, పొట్టిశ్రీరాములు ఇంజినీరింగ్ కాలేజీ పరిసరాల్లో మంగళవారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. వెస్ట్ ఏసీపీ దుర్గారావు పర్యవేక్షణలో కొత్తపేట సీఐ చిన్న కొండలరావు, పలువురు ఎస్ఐలు కాలేజీ పరిసరాల్లోని షేక్.రాజా హాస్పిటల్, శ్రీనివాసమహల్, రాజా హైస్కూల్, మహంతిపురం, గొల్లపాలెం గట్టు, పరశురామయ్య వీధుల్లోని పాన్‌షాపులు, కిరాణా షాపులలో తనిఖీలు నిర్వహించారు. కాలేజీల పరిసరాల్లో సిగరెట్లు, గుట్కా వంటి ఉత్పత్తులను అమ్మడం నిషేధమని, ఇకపై తరుచూ తనిఖీలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఆయా వ్యాపారులకు కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు వారిపై కేసులు నమోదు చేసి జరిమానా విధించినట్లు కొత్తపేట సీఐ కొండలరావు పేర్కొన్నారు.


గురుపౌర్ణమి ఉత్సవాలు ప్రారంభం



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఈ నెల 10వ తేదీ గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని భవానీపురం హౌసింగ్‌బోర్డ్ కాలనీలోని సంకల్ప సిద్ధి శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో మూడు రోజులపాటు నిర్వహించనున్న ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు మంగళవారం అఖండ జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. తొలుత సాయిబాబాకు మందిరం పాలకమండలి కోశాధికారి చందలూరు రాజశేఖర్–ఇంద్రజ్యోతి దంపతులు, భక్తులతో గోక్షీరాభిషేకం చేయించారు. అనంతరం మందిరం అధ్యక్షుడు బూర్లె వెంకటేశ్వరరావు 'ఓం సాయి శ్రీసాయి జయజయ సాయి' అనే అఖండ సాయి నామ సంకీర్తనను ప్రారంభించారు. విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. మందిరం పాలకమండలి ఉపాధ్యక్షులు మోటుమర్రి సుబ్బారావు, గౌరవ అధ్యక్షులు ఊటుకూరి శివనారాయణ, సంయుక్త కార్యదర్శి పెండేల వెంకట లక్ష్మీప్రసాద్, సహాయ కార్యదర్శి గుడివాడ విజయకుమార్, సభ్యులు పోతార్లంక రజనీకాంత్, గురజపల్లి కృష్ణ, యెనిగళ్ల సుబ్బారావు, సాయి సేవకులు పర్యవేక్షించారు.

లైసెన్స్‌డ్ దుకాణాల్లో కొనుగోలు చేయండి

పెదపారుపూడి: మండలంలో ప్రభుత్వ లైసెన్స్ పొందిన దుకాణాల్లో మాత్రమే మద్యం కొనుగోలు చేయాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ అరుణమ్మ పేర్కొన్నారు. మంగళవారం సీఐ మాట్లాడుతూ ప్రభుత్వ లైసెన్స్ పొందిన మద్యం దుకాణాల కన్నా బయట తక్కువ ధరకు మద్యం విక్రయిస్తుంటే అది నకిలీ మద్యంగా గుర్తించాలన్నారు. నకిలీ మద్యం కొనుగోలు చేసి ఆరోగ్యాన్ని పాడు చేసుకోవద్దని సూచించారు. నకిలీ మద్యం విక్రయిస్తున్న వ్యక్తులు ఎక్కడైనా ఉంటే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 14405కు సమాచారం అందించాలని కోరారు.



డ్రాప్ అవుట్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దండి

ఏలూరు జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీ పంకజ్‌కుమార్

కైకలూరు: ఏలూరు జిల్లాను డ్రాప్ అవుట్స్ రహితంగా తీర్చిదిద్దాలనే కలెక్టర్ వెట్రి సెల్వి నిర్ణయానికి తగ్గట్టుగా అందరూ కృషి చేయాలని ఏలూరు జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్(ఏపీసీ) డాక్టర్ కురేళ్ల పంకజ్‌కుమార్ తెలిపారు. వెలంపేట మోడల్ స్కూల్లో 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా మంగళవారం పాఠశాల నుంచి వ్యవసాయ మార్కెట్ యార్డు వరకు విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీసీ మాట్లాడుతూ జిల్లా స్థాయి నుంచి, డివిజనల్, మండల, క్లస్టర్ స్థాయి వరకు విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులతో కలసి బడి ఈడు పిల్లలు పాఠశాలల్లో చేర్చడానికి కృషి చేయాలన్నారు. ఈ నెల 15వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. అదేవిధంగా ఈ నెల 10న ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మెగా పేరెంట్స్ మీటింగ్‌ను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో విద్యాశాఖాధికారులు దొడ్డ రామారావు, వెలమల శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, సీఆర్ఎంటీ, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.


కైకలూరులో నిర్వహించిన అవగాహన ర్యాలీలో సమగ్ర శిక్ష ఏపీసీ పంకజ్‌కుమార్, అధికారులు

బీఎల్‌ఓలు బాధ్యతగా వ్యవహరించాలి

గుడివాడ టౌన్: బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్‌ఓలు) బాధ్యతగా వ్యవహరించాలని ఆర్డీఓ జి. బాలసుబ్రహ్మణ్యం అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశం హాల్లో గుడివాడ, రూరల్ మండల బీఎల్‌ఓల శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వాహణలో బీఎల్‌ఓల బాధ్యత ఎంతో ఉంటుందన్నారు. ఓటరుకు, అధికారులకు సమాధానం చెప్పాల్సింది బీఎల్‌ఓలే అన్నారు. కావున నిబంధనలపై పూర్తి అవగాహన పెంచుకుని విధి నిర్వాహణలో బాధ్యతగా వ్యవహరించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ పి. శ్రీనివాసరావు, తహసీల్దార్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్డీఓ బాలసుబ్రహ్మణ్యం

పొగాకు విక్రయించే దుకాణాల తనిఖీ

పమిడిముక్కల: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాఠశాలలు, కళాశాలల సమీపంలో పొగాకు విక్రయించే దుకాణాలను మంగళవారం పోలీసులు తనిఖీ చేశారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని దాడులు చేపట్టామని, సీఓటీపీఏ–2003 చట్టం ప్రకారం నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానా విధించినట్లు ఎస్‌ఐ శ్రీను తెలిపారు.





సుబ్బారాయుడికి అభిషేకాలు

ముదినేపల్లి రూరల్: సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ఆలయ ప్రధాన అర్చకుడు తోలేటి వీరభద్రశర్మ ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేకాలు చేశారు. సదూర ప్రాంతాల నుంచి వచ్చిన అనేకమంది భక్తులు స్వామివారి పుట్టలో పాలు పోసి, నాగబంధాల వద్ద పూజలు చేసి అభిషేకాలు చేయించుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా నిత్యాన్నదాన ప్రసాదానికి సంబంధించి అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆలయ ఈఓ ఆర్ గంగాశ్రీదేవి, సిబ్బంది పర్యవేక్షణ చేశారు.


అభిషేకాలు చేయించుకుంటున్న భక్తులు

పేదరిక నిర్మూలనకు పీ4 సర్వే

గుడ్లవల్లేరు: పేదరిక నిర్మూలనకు పీ4 సర్వే దోహదపడుతుందని ఎంపీడీఓ ఎండీ ఇమ్రాన్ అన్నారు. గుడ్లవల్లేరు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం వివిధ శాఖల ఉద్యోగులకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదరిక నిర్మూలనతో పరోక్షంగా అభివృద్ధి చేకూరుతుందని చెప్పారు.

పాఠశాలల వద్ద దుకాణాల తనిఖీ

గుడివాడరూరల్: మండలంలోని బిళ్లపాడు, చౌటపల్లి, మోటూరు గ్రామాల్లోని పాఠశాలల వద్ద నిర్వహించే దుకాణాలను మంగళవారం తాలూకా ఎస్‌ఐ ఎన్.చంటిబాబు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ పాఠశాలల వద్ద నిర్వహించే దుకాణాల వద్ద సిగరెట్లు, గుట్కాలు, ఇతరత్రాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. మిగిలిన గ్రామాల్లో కూడా తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.


బిళ్లపాడులో దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ చంటిబాబు

శాకంబరీ అవతారంలో నాగసుబ్రహ్మణ్యేశ్వరుడు

మండవల్లి: మండవల్లిలో కొలువై ఉన్న శ్రీ నాగసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారు శాకంబరీ అవతారంలో మంగళవారం దర్శనమిచ్చారు. అర్చకులు గూడూరు శ్రీనివాసరావు స్వామిని వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు.





ప్రత్యేక పూజలు

పామర్రు: ఉండ్రపూడి–పోలవరం అడ్డరోడ్డు వద్ద ఉన్న వీరాంజనేయస్వామి ఆలయంలో ఆషాఢ మాసం మంగళవారం కావడంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఆలయంలో స్వామికి పంచామృతాలతో అభిషేకాలను నిర్వహించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పాల పొంగళ్లను వండి స్వామికి నివేదించారు. పూజా కార్యక్రమాలు అర్చకులు అగ్నిహోత్రం దినకర్, సహాయకులు ఫణిశర్మ, శర్మ, సుబ్బారావుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వర ప్రసాదరావు పాల్గొన్నారు.


స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

సమరశీల పోరాటాలు సాగించాలి

మండవల్లి: భూములు, ఇళ్ల స్థలాల సమస్యలపై సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి పిలుపునిచ్చారు. సింగనపూడి కమ్యూనిటీ హాల్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో భూములు, ఇళ్ల స్థలాల సమస్యలపై మంగళవారం భూ సదస్సు నిర్వహించారు. సదస్సుకు ఫీల్డ్ లేబర్ కోపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రా జగదీష్ అధ్యక్షత వహించారు. తొలుత సీపీఎం జెండాను ఆవిష్కరించారు. ఫీల్డ్ లేబర్ కోపరేటివ్ సొసైటీ కార్యదర్శి ఉచ్చుల సుధీర్‌కుమార్, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రవి

సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరసన

మండవల్లి: స్థానిక ఎంఈఓ కార్యాలయం వద్ద మంగళవారం సమగ్ర శిక్షా ఉద్యోగులు నిరసన చేపట్టారు. ఉద్యోగులు మాట్లాడుతూ సమగ్ర శిక్షాలోని ఉద్యోగులకు ఏటీఎస్, హెచ్ఆర్ పాలసీ, సమ్మె అగ్రిమెంట్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అకౌంటెంట్ భగవాన్, కంప్యూటర్ ఆపరేటర్ వెంకటరత్నం, ఎంఐఎస్ కో–ఆర్డినేటర్ కనకదుర్గమ్మ పాల్గొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు



సమ్మెను జయప్రదం చేయండి

గుడివాడ టౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 9వ తేదీన నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెలో ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ టీయూసీ రాష్ట్ర కార్యదర్శి తులిమిల్లి యెషయ్య మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రతి ఒక్కరూ ఈ సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.





ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలి

గుడివాడరూరల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలను నాటాలని ఎంపీడీఓ విష్ణుప్రసాద్ అన్నారు. ఉపాధి హామీ పథకంలో మండలంలోని చిరిచింతల గ్రామానికి మంజూరైన అమృత సరోవరలోని కొబ్బరి మొక్కలను గ్రామంలోని చెరువు గట్టుపై మంగళవారం నాటారు. టీడీపీ మండల అధ్యక్షుడు వాసే మురళీ పాల్గొన్నారు.


చిరిచింతల గ్రామంలో మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ విష్ణుప్రసాద్

మున్సిపల్ మోడల్ ప్రైమరీ స్కూల్లో..

గుడివాడ టౌన్: పర్యావరణ పరిరక్షణలో మొక్కలు ప్రధానపాత్ర పోషిస్తాయని మండల వ్యవసాయాధికారిణి బి. అనంతలక్ష్మి అన్నారు. మంగళవారం స్థానిక ఎన్టీఆర్ కాలనీ మున్సిపల్ మోడల్ ప్రైమరీ స్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు. అతుల్ ఫౌండేషన్ గుజరాత్ వారి సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. శ్రీకృష్ణ యాదవ సేవాసంఘం అధ్యక్షుడు పుట్టి హరికుమార్, పి.వి. నాగబాబు, అతుల్ కంపెనీ ప్రతినిధి కోటయ్య, స్కూల్ హెచ్ఎం రజిని పాల్గొన్నారు.



